1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

ఎంపీడీవోను సన్మానించిన నాయకులు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారిగా నూతనంగా విధుల్లో చేరిన పర్బన్నకు స్థానిక జడ్పీటీసీ మనోహర్‌రెడ్డితో పాటు నాయకులు శాలువాతో శుక్రవారం సత్కరించారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి సంతోష్, సొసైటీ డైరెక్టర్ వంశీకృష్ణగౌడ్ తదితరులున్నారు.

సౌదీ అరేబియాలో గాంధారి వాసి ఆత్మహత్య

- మృతదేహాన్ని తెప్పించాలని వినతి



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన చాకలి పోచయ్య సౌదీ అరేబియాలో రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు ఆత్మహత్య చేసుకున్న చాకలి పోచయ్య మృతదేహాన్ని తెప్పించాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడుని మృతుని కుటుంబ సభ్యులు కలిసి అభ్యర్థించారు. వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై స్పందించిన కోటపాటి సౌదీలోని ఇండియన్ ఎంబసీ, ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే యజమాని పూర్తి ఖర్చులతో మృతదేహాన్ని ఇంటికి పంపే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

ఆపందిఫారం తండాలో పేరుకుపోతున్న చెత్త

- తాగునీటికీ ఇబ్బందులే
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-వర్ని

వర్ని మండలంలోని ఆపందిఫారం తండా గ్రామంలో చెత్త చెదారం పెరుకుపోతోంది. తద్వారా దోమలు విజృంభిస్తున్నాయి. దుర్వాసన సైతం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే తాగునీటి సమస్య సైతం వేధిస్తోంది. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీకీ ఎన్నిసార్లు చెప్పినా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



గ్రామ సమీపంలో పేరుకుపోయిన చెత్త



మండలంలోని ఆపందిఫారం తండా గ్రామ పంచాయతీ సుమారు 200 జనాభా ఉంటుంది. గ్రామంలో ఏదైనా శుభకార్యాలు నిర్వహిస్తే ఆ చెత్తనంతా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జీపీకి కేటాయించిన ట్రాక్టర్‌లో డంపింగ్‌యార్డ్‌కు తరలించాలి. కానీ సంబంధిత జీపీ అధికారులు అవేమీ చేయకుండా ఊరు పక్కనే ప్రధాన నిజాం సాగర్ కెనాల్ అంచున చెత్తను డంప్ చేస్తున్నారు. దాంతో బలమైన ఈదురుగాలులు వీచినప్పుడు డంప్ చేసిన చెత్తలోని ప్లాస్టిక్ కవర్లు, ఎంగిలి ఇస్తరాకులు గ్రామంలోకి వచ్చి చేరుతున్నాయి. అయితే గతంలో 15 రోజులపాటు పారిశుధ్య కార్యక్ర మాలు చేపట్టినా.. తమ గ్రామంలో సమస్యలు పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలుపుతున్నా పట్టించుకోవడంలో పంచాయతీ సెక్రెటరీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారని ప్రజలు నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పన్నులు వసూలు చేస్తారు.. తాగునీటి కష్టం తీరదు..

అసలే రాబోయేది వేసవి కాలం. గ్రామంలో ఉన్న రెండు మోటార్లలో నుంచి వాటర్‌ను తాగునీటిని సరఫరా చేసేలా చూడాలని, అందుకు తాగునీరు అందించే బోరు మోటర్లు గుంతలో ఒక పైపును దించితే తాగడానికి నీరు పుష్కలంగా వస్తుందని పంచాయతీ సెక్రెటరీ కోరినప్పటికీ 'మీ గ్రామ ప్రజలు మంచోళ్లు కారు. బడ్జెట్ లేదు. నేను చెయ్యను.' అని మొండితనంతో సెక్రెటరీ మాట్లాడుతున్నాడని గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మరోవైపు చెత్తను వేస్తున్నా కనీసం తడి చెత్త పొడి చెత్తను వేరు చేయకుండా డంపింగ్ యార్డ్‌లో వేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక పాలన అధికారి, పంచాయతీ సెక్రెటరీ వెంటనే స్పందించి చెత్త చెదారాన్ని తొలగించాలని, అలాగే తాగునీరు ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

తాగునీరు వచ్చేలా చూడాలి



గ్రామంలో ఒక బోరు ద్వారా మిషన్ భగీరథ ట్యాంక్‌లోనికి నీరు పంపుతారు. మరొక బోరు కాలనీ మొత్తానికి తాగునీరు ఇస్తారు. ఆ తాగునీటి బోరులో నీరు తగ్గడంతో పొద్దుగాల ఇబ్బంది పడుతున్నాం. 'బోరు గుంతలో ఒక పైపు దింపితే నీరు ఎక్కువగా వస్తుంది. అందరికీ సరిపోతుందని సెక్రెటరీ చెబితే.. మీ గ్రామ ప్రజలు మంచోళ్లు కారు' అని అంటున్నాడు. ఆఫీసర్లు మాకు తాగునీరు వచ్చేలా చూడాలి. - గ్రామ మహిళ

ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై
పాలకమండలి దృష్టి సారించాలి

- 2024-25 సంవత్సర బడ్జెట్ రూ.4228.11లక్షలు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్నందున ప్రజలకు ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు గాను ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై పాలక మండలి దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ కమిషనర్ సుజాతతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి రూ.4228.11లక్షల అంచనా బడ్జెట్, 2023-24 సంవత్సరానికి సవరించిన రూ.3666.4 లక్షల బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇందులో పన్నుల రూపేణా రూ.1295.90లక్షలు, అద్దెలు,



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ మార్గాల ద్వారా రూ.1368.21 లక్షలు, డిపాజిట్లు, లోన్స్ ద్వారా రూ.22లక్షలు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్స్ ద్వారా రూ.142 లక్షలు వస్తాయని అంచనా వేశారు. ఇందులో జీతాలు, శానిటేషన్, విద్యుత్ బిల్లుకు రూ.216లక్షలు, గ్రీన్ బడ్జెట్ కింద రూ.296 లక్షలు ఖర్చు చేయాలని నిర్దేశించారు. వీటితోపాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సాధారణ పరిపాలన ఖర్చులు రూ.238లక్షలు, వార్డు వారీగా చేపట్టిన పనులు, ప్రజోపయోగ పనులకు రూ.22.33లక్షలు, డిపాజిట్లు, లోన్ల కింద రూ.22 లక్షలు, నాన్‌ప్లాన్ గ్రాంట్ కింద రూ.1542 లక్షలు ఖర్చు చేయుటకు రూపొందించిన ప్రణాలికకు సభ ఆమోదం తెలుపుతూ తీర్మానించింది.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు ఆయా వార్డుల అభివృద్ధి, పట్టణ అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉండడమే గాక అభివృద్ధి పనులు చేపట్టాలని తాపత్రయపడడం చూస్తుంటే సంతోషంగా ఉందని, మునిసిపల్ బడ్జెట్‌తో పాటు ఇతర శాఖల సహకారం, ప్రభుత్వం నుంచి ఇతర గ్రాంట్ల రూపంలో వచ్చే నిధులతో పట్టణంలో మంచినీటి సౌకర్యం తదితర వాటికి ఖర్చు చేస్తామన్నారు. పాలకమండలి కూడా ఆదాయ వనరుల పెంపునకు మార్గాలు అన్వేషించాలని, వాణిజ్య ప్రాంతాలలో యూజర్ చార్జీల ద్వారా, వంద శాతం పన్ను వసూళ్ల ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మంచినీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ కుళాయిలు పెట్టుకునేలా చూడాలని కోరారు. వైకుంఠధామాలు వాడుకలో వచ్చేవిధంగా చూస్తామని సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

అదనపు కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఇంటిని బట్టి ఇంటి పన్నును హేతుబద్ధికరణ చేయడం, వందశాతం పన్ను వసూలు చేయడం, జనాభా ప్రాదిపదికకు అనుగుణంగా శానిటేషన్, వాటర్ వర్కర్స్ సిబ్బందిని హేతబద్ధీకరించడం ద్వారా ఆదాయ మార్గాలను మెరుగుపర్చుకోవచ్చని, పాలకమండలిలో చర్చించి నిర్ణయాలు తెలుసుకోవలసినదిగా సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ అంకెల గారడి

- జనరల్ బాడీ సమావేశం వాయిదా
- బిజెపి ఫ్లోర్ లీడర్ మోటారి శ్రీకాంత్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్‌లో శుక్రవారం ప్రవేశపెట్టిన మున్సిపల్ బడ్జెట్ అంకెల గారడీ తప్పా.. ప్రజలకు ఒరిగిందేమీ లేదని బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటారి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. మున్సిపల్ చైర్మన్ ప్రవేశపెట్టిన మున్సిపల్ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. జనరల్ బాడీ సమావేశంలో సుమారు మూడు కోట్లతో ప్రవేశపెట్టిన ఎజెండా అది ఫేక్ ఎజెండా అని జనరల్ నిధులు కాకుండా ప్రత్యేక నిధుల నుండి నిధులు తీసుకోవడం సరికాదన్నారు. ఒక్క 30వ వార్డ్‌కే 30 లక్షలు కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటివరకు ఒక్కో వార్డుకో జనరల్ ఫండ్ ద్వారా నిధులు ఎంత కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీకి కమిటీ సభ్యుల రాక

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రఖ్యాత నిజాంషుగర్ ఫ్యాక్టరీ పరిశీలనకు ప్రభుత్వం నియమించిన నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఫ్యాక్టరీ పరిశీలనకు వస్తున్నట్లు మజ్దూర్ సభ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ శుక్రవారం తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించిన కమిటీ సభ్యులు హాజరవుతున్న సందర్భంగా వారికి కార్మికుల సమస్యల సైతం వివరిస్తామని ఆయన పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా ఇసాయిపేట్ నరేష్



నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన ఇస్సాయిపేట్ నరేష్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు నా వంతు కృషి చేస్తానని, నాపై నమ్మకం ఉంచి, కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు గోగార్ల శోభన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ మహిళల సమస్యలను వివరించినట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కామని సుదర్శన్ నేత అన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ తెలంగాణ రాష్ట్ర మంత్రి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మంజులను తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీల, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీసీ సంఘం నాయకులకు అభినందనలు తెలుపుతున్నానని తెలిపారు. బీసీ సంఘం నాయకులకు ఎల్లవేళల తాను అండగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బీసీ నాయకులు అరవింద్, మహేష్, కామారెడ్డి పట్టణం 38వ వార్డు, బిసి మహిళా సంఘం ఇన్చార్జి వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఉపాధి హామీ పనులను ముమ్మరంగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి సంతోష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని, పనులలో నిర్లక్ష్యం చేయవద్దని, పనుల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏపీఓ రజిత, కార్యదర్శి లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

అఘాయిత్యాలను నిరోధించాలి

- జిల్లా సంక్షేమ అధికారిని రసూల్‌బీ

నవతెలంగాణ-బోధన్

గ్రామాలలో బాల సభలు నిర్వహించి బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించేలా అవగాహన సదస్సులు నిర్వహించి, అఘాయిత్యాలను నిరోధించాలని జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి అన్నారు. శుక్రవారం బోధన్ మండలం అమ్దాపూర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన బేటి బచావో - బేటి పడావో ఓరియంటేషన్ సెన్సిటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో స్త్రీ పురుషులు సమానమేనని అవగాహన కల్పించాలని, లింగ వివక్ష లేకుండా చూడాలని ఆమె అన్నారు. జిల్లాలో గతంలో కంటే బాలికల నిష్పత్తి పెరగడానికి కృషి చేసినట్లు తెలిపారు. నేటి కాలంలో బాలికల సంఖ్య పెరగడమే కాకుండా అన్ని రంగాలలో వారు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. కేరళ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి

రాష్ట్రంలో బాలికల సంఖ్య పెరగడమే కాకుండా అభివృద్ధి చెందారని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని, బాల్యవివాహాల వలన జరిగే దుష్పరిణామాలను వివరించాలన్నారు. పాఠశాలలో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేలా బాలిక విద్య మెరుగుపడేలా చూడాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించాలని, తల్లీబిడ్డల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గృహ సంబంధ వివాదాలపై సఖి సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వడంపై వివరించాలని కోరారు. అనంతరం లఘు చిత్రాలు ప్రదర్శించి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీలలో పిల్లల వయసు, బరువుపై సంక్షేమ అధికారిని అంగన్వాడీ టీచర్లను వివరణ కోరగా.. ఎవరు కూడా సరైన సమాధానం చెప్పకపోవడం గమనార్హం. దీంతో అంగన్వాడీ కేంద్రాలలో టీచర్లు ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారో వారి పనితీరు తెలిసినట్లయింది. ఈ సమావేశంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, సిడిపిఓ జానకి, మెప్మా కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతేనే ప్రయాణించండి

- మహిళలకు కామారెడ్డి డిపో మేనేజర్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణలో సమ్మక్క సారక్క జాతర మేడారంలో జరుగుతున్నందున కామారెడ్డి డిపో నుంచి 58 బస్సులను మేడారంకు పంపించామని, ఇప్పటివరకు కామారెడ్డి డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు తక్కువగా తిరుగుతున్నందున మహిళలు, ప్రయాణికులు ఎవరైనా అవసరమైతేనే బస్సుల్లో ప్రయాణించాలని కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా తెలిపారు. ప్రస్తుతం కామారెడ్డి డిపో నుండి ఎయిర్ బస్సులు 49, సూపర్ లగ్జరీ 8, డీలక్స్ బస్సులు 17, ఆర్డీనరీ బస్సులు రెండు నడుస్తున్నాయని మేనేజర్ ఇందిరా తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు ప్రయాణాలు చేయాలని ఆమె తెలిపారు. 'రామాయంపేట్, తూప్రాన్ ఇతర స్టేషన్లో బస్సులు ఆగడం లేదు. ఆ బస్సులు ఖాళీగా వెళ్తున్నాయి'. అన్న ప్రశ్నకు డిపో మేనేజర్ ఇందిరా సమాధానం ఇస్తూ అవి నాన్ స్టాప్ బస్సులు, సూపర్ లగ్జరీ బస్సులు ఎలా ఆగుతాయని స్పష్టం చేశారు. అలా ఆపినట్లైతే బస్సులోని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తారని సమాధానం చెబుతూ వచ్చారు.

బోధన్ న్యాయస్థానంలో తొలిసారి తెలుగులో తీర్పు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని కోర్టులో శుక్రవారం ఓ కేసు విషయంలో న్యాయమూర్తి ఈసంపల్లి శివసాయి తెలుగు భాషలో తీర్పును వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ మంగరి రాజేందర్ తెలుగులో తీర్పు వెల్లడించిన న్యాయమూర్తి శివసాయిను అభినందించారు. కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి.. 2016 మార్చి 23న నెహ్రూనగర్‌కు చెందిన రాజేశ్వర్ నవీపేట్‌కు వెళ్లడానికి బయలుదేరి జానకంపేట్ సమీపంలో ఆటో ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం తెలిసిన ఆయన భార్య లావణ్య ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రమాద ఘటనపై ఫిర్యాదు చేశారు. ఆటో అజాగ్రత్తతో నడిపి తన భర్త కాలు నుజ్జునుజ్జయేలా చేసిన ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ చేసి చార్జిషీటు కోర్టులో ఫైల్ చేయడంతో న్యాయమూర్తి విచారణ చేపట్టి శుక్రవారం తెలుగులో తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నేరము రుజువు కానందున కేసును కొట్టివేశారు.

26న బోధన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోడీ

నవతెలంగాణ-బోధన్

ఈనెల 26వ తేదీన బోధన్ పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు హైదరాబాద్, సికింద్రాబాద్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ విద్యాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ పట్టణంలోని గాంధీపార్క్ స్టేషన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా 500 స్టేషన్లకు శంకుస్థాపనలో ప్రధాని నరేంద్ర మోడీ ద్వారా దాదాపు 1,500 రైల్వే ఫ్లైఓవర్/అండర్‌పాస్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణలో రైలు స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ప్రస్తుతం, రాష్ట్రంలో రైలు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అనేక రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,071 కోట్లతో 40 స్టేషన్లను ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన కోటగిరి ఎంపీపీ



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-కోటగిరి

ఉమ్మడి కోటగిరి మండలంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఉమ్మడి కోటగిరి మండలంలో బీటలు వారాయి. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రధాన అనుచరునిగా ఉన్న కోటగిరి మండల ఎంపీపీ వల్లేపల్లి సునీత శ్రీనివాస్‌రావు బాన్సువాడ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమీక్షంలో శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కోటగిరి మండలాధ్యక్షులు షాహిద్ హుస్సేన్, నిజామాబాద్ డెలిగేట్ కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఆధర్వంలో వల్లేపల్లి సునీత శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చాపకింద నీరులా కాంగ్రెస్ పార్టీ కోటగిరి మండలంలో శరవేగంగా విస్తరిస్తుంది. ఉమ్మడి మండల బిఆర్ఎస్ ఎంపీటీసీలు అనంత విటల్, వీరేశం, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కోటగిరి మాజీ సర్పంచ్ బర్ల గంగారం, యువ నాయకులు బర్ల మధు తదితరులు కాంగ్రెస్ పట్ల ఆకర్షితులై ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ దేశాయ్, కాంగ్రెస్ మైనారిటీ ఉపాధ్యక్షులు వహీద్, మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్, రాష్ట్ర గిరిజన ఉపాధ్యక్షులు ప్రతాప్ సింగ్, బాన్సువాడ నియోజవర్గ యూత్ అధ్యక్షులు మధుసూధన్, పోతంగల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసి పుప్పాల శంకర్, కొత్తపల్లి విండో అధ్యక్షులు డాక్టర్ సునీల్, కోటగిరి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఖాదర్, ఎత్తొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు రఫీ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సిఐ, తహసీల్దార్‌కు సన్మానం



సీఐని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ సి.ఐ సంతోష్‌కుమార్‌ను తహసీల్దార్ గంగాసాగర్‌ను లింగంపల్లి తాజా మాజీ సర్పంచ్ గుండెల్లి సాయిలు దామోదర్‌రావు శుక్రవారం శాలువాతో సన్మానించారు. వీరిద్దరూ సదాశివనగర్‌కు కొత్తగా వచ్చారు. కార్యక్రమంలో లింగంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని సాయినగర్ కాలనీలో గత మూడు సంవత్సరాలుగా ఓల్టేజి సమస్యతో ఇబ్బందిగా ఉండడంతో ఈ విషయాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి మాజీ సర్పంచ్ బోయిని విట్టల్ తీసుకెళ్లడంతో వెంటనే స్పందించినత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శుక్రవారం కాలనీలో 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించినట్టు మాజీ సర్పంచ్ బోయిని విట్టల్ తెలిపారు. మండల కేంద్రంలో అదనంగా 63 కెవి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరికి అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. వోల్టేజ్ సమస్య తీర్చడంతో కాలనీవాసులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బోయిని రాధతో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్‌రెడ్డి, నాయకులు శేఖర్ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

అసుపత్రిలో మరమ్మతులు, పునరుద్ధరణ పనుల పరిశీలన



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మతులు, పునరుద్ధరణ పనులను శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ కిషన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎన్ హెచ్ ఎం (2023-24) అంచనా విలువ 18.20 లక్షలతో పనులను పూర్తిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ" కొన్ని ఏళ్ల క్రితం నిర్మించిన అసుపత్రిలో మరమ్మతులు చేయలేక పోయారని అన్నారు. ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టడానికి నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. ఇంక ఏమైన మిగిలి ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందని వారన్నారు. వారి వెంట తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆనందగిరి లక్ష్మి నృసింహస్వామి కళ్యాణం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, కళ్యాణంలో భాగంగా కొండ ప్రదక్షిణ ద్వార స్వామి అమ్మ వార్లకు ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ అర్చకులు దండాల మోహన్ శర్మ అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. శనివారం రథోత్సవం (జాతర) నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ ప్రశాంత్ తెలిపారు.

రైతుల పోరాటానికి మద్దతుగా 26న నిరసన



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఈనెల 26న నిరసనలో రైతులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు తెలిపారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతాంగం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఢిల్లీ సరిహద్దులో ఉన్న హర్యానా, పంజాబ్, ఇతర రాష్ట్రాల రైతులు ఢిల్లీ సరిహద్దులకు చేరుకోగానే బిజెపి ప్రభుత్వం పోలీసులు ఉపయోగించి రైతులపై లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పోలీసుల కాల్పుల్లో ఇప్పటికే ఒకరు మరణించగా అనేకమంది క్షతగాత్రులు అయ్యారని అన్నారు. దీనిని నివసిస్తూ ఈనెల 26న సిపిఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొని బిజెపి అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ప్రెస్‌మీట్‌లో సిపిఐ నాయకులు పి.రంజిత్ కుమార్, రాధా కుమార్, ఆనంద్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా కవలల దినోత్సవం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫిబ్రవరి 22 అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విజయ్ హైస్కూల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిశుతరగతి (పిపి1) నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 21జంట కవలలకు తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే వేదికపై 21జంట కవలలందరూ ఇలా కనిపించడం హర్షించదగిన విషయమని, ప్రతీ యేడు ఫిబ్రవరి 22న కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్. అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి. సుజాత, ప్రిన్సిపాల్ విజేత, 21 జంట కవలలను ఆశీర్వదించారు.

సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యానం గుట్ట సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. రెండు హ్యాండ్ బోర్లు చెడిపోవడం వల్ల వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు వారం రోజుల నుంచి సమ్మెలో ఉండడం వలన యానం గుట్ట సుందరయ్య కాలనీలో మంచినీటి సమస్య తీవ్ర ఇబ్బందిగా ఉందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఏ.రాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంజేశారు. అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. చెడిపోయిన బోర్లను రేపు చేయిస్తానని హామీనిచ్చారు. ఇంటి నెంబర్లు వారం రోజుల్లో ఇస్తామని తెలిపారు. డ్రైనేజీ, కరెంటు స్తంభాలు, మొరం రోడ్లు పాలకవర్గం చైర్మన్ వచ్చిన తర్వాత తీర్మానంలో పెట్టి కాలనీ మస్యలను అన్ని పరిష్కరిస్తానని కమిషనర్ హామీనిచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు జవహర్ సింగ్, సాయిలు, ఓంకారం ఎండి రఫీ, ఎండి హమాయిర్ ఖాన్, షాయదా భేగం, రజియా చాంద్‌బీ, సమీరా మస్రత్, పద్మ వాసవి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని కారేపల్లి, దేవక్కపేట గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్ఓసి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అందజేశారు. కారేపల్లికి చెందిన భుక్యా మంగ్య అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే దేవక్క గ్రామానికి చెందిన శ్రీకాంత్ నిమ్స్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి మంగ్యాకు రెండు లక్షల 50 వేలు, శ్రీకాంత్‌కు రూ.60వేల ఎల్ఓసిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. మంజూరు పత్రాలను సునీల్‌రెడ్డి శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకం

- శిక్షణ తరగతుల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఒకరిద్దరు మినహాయిస్తే సెక్టోరల్ అధికారులు అందరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని అన్నారు. ప్రస్తుతం కూడా అదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని హితవు పలికారు. ఇదివరకు పని చేసాం కదా అనే భావనతో విధులను ఎంతమాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఏ చిన్న అనుమానానికి సైతం అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికలతో ముడిపడిన విధులు అయినందున తప్పిదాలకు ఆస్కారం కల్పిస్తే, ఎలక్షన్ కమిషన్ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఈవీఎంల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పక్కాగా నిబంధనలు పాటించాలని అన్నారు. మాక్ పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, సెక్టోరల్ అధికారులు వెంటనే స్పందించి తమ వద్ద రిజర్వ్‌లో ఉంచిన యూనిట్లను సమకూర్చాలని సూచించారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెంటదివెంట ఎన్ కోర్ యాప్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులతో పాటు, గత ఎన్నికల్లో చోటుచేసుకున్న సంఘటనలు, వివిధ అంశాల ప్రాతిపదికన సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిర్ణీత గడువులోపు పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మీదట మూడు రోజుల్లోపు తుది నివేదికను అందించాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా పెట్టి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. అలాంటి పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక జాబితాలో చేరిస్తే, పోలీసుల సహాయంతో జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర సామాగ్రిని పంపిణీ చేసే అవకాశాలు ఉన్నందున, కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రాంతాలను సందర్శిస్తూ, స్థానికులతో క్రమం తప్పకుండా భేటీలు నిర్వహించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకోవచ్చని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా గట్టి పోలీస్ బందోబస్తుతో భద్రతా ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు సిబ్బంది, సాయుధ బలగాలను మోహరిస్తామని అన్నారు. శిక్షణ తరగతుల్లో జిల్లా ఉప ఎన్నికల అధికారి కృష్ణవేణి, ఆర్మూర్ ఆర్డీఓ వినోద్ కుమార్, ఏఆర్ఈఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత డిజైన్ ప్రకారమే మంచిప్పప్రాజెక్టు

- ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- బంజారాలకు పోడు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం
- ఘనంగా భోగ్‌బండార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్ పల్లి గ్రామంలో గల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన భోగ్ బండార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. బంజారా జాతిబిడ్డలు చాలా గొప్ప వారని, వారు కష్టాన్ని నమ్ముకుంటారని, ఇతరుల పైన ఆధారపడి ఉండరని అన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రతి దగ్గర కాంగ్రెస్‌కు బ్రహ్మాండమైన మెజార్టీ ఇచ్చారని, వారి రుణాన్ని మర్చిపోనని, ఎప్పుడూ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఆయన తెలిపారు. మంచిప్ప ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారమే కొనసాగిస్తానని, నియోజకవర్గ ఏడు మండలాల్లో నీటి కొరతలు ప్రారంభం అయ్యాయయని, గత పాలకులు చేసిన పాపమే, అని కృష్ణా జలాలను ఆంధ్ర ప్రాంతానికి తరలించే విధంగా చేసిన దౌర్భాగ్య వాది కేసీఆర్ అని తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. బంజారా నాయకులకు రిజర్వేషన్ కల్పించింది కూడా మాజీ ప్రధాని ఇందిరమ్మ అని, అలాగే గత ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకొని బంజారా సోదరులకు పోడు పట్టాలివ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలందరికీ పోడు పట్టాలందే విధంగా ఎమ్మెల్యే చూసుకుంటారని అన్నారు. నిరుపేద బంజారాలకు ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టించి తీరుతామని ఇంకొక్క వారం రోజుల్లో అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్ కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, టిపిసిసి డెలికేట్ శేఖర్ గౌడ్, మోపాల్ మాజీ విండో చైర్మన్ సూర్య రెడ్డి, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, బున్నె రవి, దేవ శంకర్ ఆర్డీఓ, తహసీల్దార్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్ నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు

నవతెలంగాణ-ఆర్మూర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పట్టణంలో ఎస్టీ బాలికల హాస్టల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు అన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీకాంత్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పట్టణంలో ఎస్టీ హాస్టల్ నిర్మించాలని గత ప్రభుత్వ ఎమ్మెల్యేలను కలువగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అమలుకాలేదన్నారు. పట్టణంలో ఎస్టీ గర్ల్స్ హాస్టల్ లేకపోవడంతో ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో బీసీ హాస్టల్‌లో ఎస్సీ హాస్టల్లో లిమిట్స్ సీట్లు ఉండడంతో ఎస్టీ విద్యార్థులకు అవకాశాలు కొసరుగానే మిగిలాయని తెలిపారు. ఈ విద్యా అకాడమికైనా ఆర్మూర్‌లో ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలని అన్నారు. లేకుంటే ఉద్యమాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జవహర్ సింగ్. నాయకులు అభిషేక్ పాల్గొన్నారు.

అబాకస్, వేదిక్ మ్యాథ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు సత్యశోధర్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరికొండ

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో ఈనెల 25 ఆదివారం పి.యస్.యం.హైస్కూల్ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు టి.శివాని, యస్.కార్తీక, కె.అనన్య పాటిల్, వి.సాధ్వి, అబాకస్‌లో, పి.యశ్వంత్, వి.వైష్ణిక, పి.నవ్యశ్రీలు వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అభినందించారు. పటిష్ట ప్రణాళిక, సమయపాలనతో అభ్యాసం చేస్తూ, నైపుణ్యాలను మెరుగుపరుచుకొని రాష్ట్రస్థాయి పోటీ పరీక్షాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రాజు, వనిత, జ్యోతి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలి

- ఆర్డీవోకు వినతి



వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్లు ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన ప్రజలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ద్యారంగుల కృష్ణ మాట్లాడుతూ.. నిజామాబాద్ ఉత్తర మండల పరిధిలో సర్వేనెంబర్ 171,172లో గల ప్రభుత్వ భూమిలో గత ఏడాదిన్నరగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. పలుమార్లు కనీస మౌలిక వసతులు తాగునీరు, కరెంటు సౌకర్యం గురించి అధికారులకు విన్నవించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేదలను నిర్లక్ష్యం చేసిందని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అధికారులు స్పందించి ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇండ్లు ఇండ్ల స్థలాల సాధన కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు గట్ల గంగాధర్, రామచందర్, పొడిశెట్టి లావణ్య, వి.మీరా, స్వప్న, మునవర్, మంజుల, రహమత్, భాస్కర్, రహేనబి, అంజయ్య, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

నూతన ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్‌ను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మునీరొద్దీన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. అందుకు అన్ని వర్గాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మండల ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన గద్దల సంతోష్ అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముప్కాల్ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి దంపతులు రూ.5 వేలు బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. పలువురు ప్రముఖులు సైతం బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయాన్ని అందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- మేయర్ దండు నీతూ కిరణ్



మాట్లాడుతున్న మేయర్ నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మున్సిపల్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ నిర్వహించారు. నిన్న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రస్తావించిన సమస్యలపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ మురళి మనోహర్ రెడ్డి, డీసీపీ శ్యామకుమార్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ శంకర్, ఎలక్ట్రిసిటీ డిఈలు రాజశేఖర్, వీరేశం, చంద్ర శేఖర్, మున్సిపల్ డి. ఈలు ఆనంద్ సాగర్, ముస్తాక్ అహ్మద్, రెవెన్యూ ఆఫీసర్ నరేందర్, ఎంహెచ్ఓ సాజిద్ అలీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎలక్ట్రిసిటీ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు తనిఖీ



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్‌లోని కళాశాలలో బీఈడీ మూడవ సెమిస్టర్‌కి సంబంధించిన ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ జరుగుతుండగా ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుకాని విద్యార్థులకుఆబ్సెంట్, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మందలించారు. అధ్యాపకులకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడిగా ఉదయ్ కిరణ్ ఎంఈఓగా నిశాంత్, డీఈవోగా జస్వంత్ విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సిఐ, ఎస్సైలకు సన్మానం



నవతెలంగాణ-బిచ్కుంద

ఇటీవల బదిలీపై వచ్చిన బిచ్కుంద సీఐ జగడం నరేష్, బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించి భగవద్గీత గ్రంథాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కొలవార్ కుమార్ సేట్, వైస్ చైర్మన్ రచ్చ శివకాంత్, జిల్లా కోశాధికారి దస్థిరాం, డివిజన్ సభ్యులు వెంకటరమణ, హుండే బసవరాజ్, నర్సింలు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి యువత చేతుల్లో ఉంది

- దేశం పురోగమించాలంటే మంచి నాయకత్వం ఉండాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

దేశాభివృద్ధి యువత చేతుల్లో ఉందని, దేశం పురోగమించాలంటే మంచి నాయకత్వం ఉండాలని, ఆ అవకాశం భారత రాజ్యాంగం మనకు ఓటు హక్కు ద్వారా కల్పించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ప్రతి తరగతిని సందర్శించి ఏప్రిల్ 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఓటు వేసి గొప్ప అవకాశముంటుందిని, ఆ తొలి అనుభూతి పొందాలన్నారు. బ్రిటిష్ కాలంలో కొందరికే ఓటు వేసే అవకాశముండేదని, కానీ నేడు భారత రాజ్యాంగం 18 ఏళ్ళు నిండిన అందిరికీ అవకాశం కల్పిస్తూ దేశాభివృద్ధిలో పాలుపంచుకునేలా ఓటు అవకాశం కల్పించిందని అన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ ద్వారా, లేదా ఈసీ, ఐవెబ్‌సైట్ ద్వారా గాని, ఫారం-6 ద్వారా గానీ ఆఫ్‌లైన్‌లో ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చని అన్నారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్న, చట్టాలు, చేయాలన్న, శాసనసభ, పార్లమెంటులోనే చేయవలసి ఉంటుందని, మన వాయిస్‌ను ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికలలో నిలిచే ప్రతి అభ్యర్థి నేర చరిత్ర, స్థిర చరాస్తుల వివరాలు అఫిడవిట్ ద్వారా అందిరికీ తెలియపరుస్తున్నదని, యువత విజ్ఞతతో ఓటు వేయాలని, దానిపైనే మీ జీవితం ముడిపడి ఉంటుందని గ్రహించాలని హితవు చెప్పారు. చట్టాలు, రాజకీయాల పట్ల యువత కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలని, మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు గురికారాదని అప్పుడే సమాజానికి పాటుపడే నాయకున్ని ఎన్నుకోగలుగుతారని అన్నారు. యువత విదేశీ మోజులో పడి అక్కడ ఇబ్బందులకు గురవుచున్నారని, మన దేశంలోనే పుష్కలమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని, సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు దేశాభివృద్ధికి పాటుపడిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. రంగనాథరావు, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు

- అలరించిన చిన్నారుల నృత్యాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, తాజా మాజీ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అంకిత భావంతో ఇష్టంతో చదువితే ఉత్తమ ర్యాంకులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం పాఠశాలలో చిన్నారుల నృత్యాలు పలువురుని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, తాజా మాజీ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఉపాధ్యాయులు గంగాధర్, రహమాన్, కిషోర్, గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి పోరు గర్జన ర్యాలీ

- ఫీజు బకాయిల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల సంబంధించిన ఇంజనీరింగ్, డిగ్రీ, బి.ఎడ్, పాలిటెక్నిక్, మెడికల్, నర్సింగ్, ఇంటర్ విద్యార్థుల ఫీజులను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయని, వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెండింగ్లో ఉన్న పూర్తి ఫీజు బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని కోరుతూ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి పోరుగర్జన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, రాష్ట్ర నాయకులు రానున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 24న మండలంలోని రెంజల్, నీలా, తాడ్‌బిలోలి, దండిగుట్ట సబ్ స్టేషన్‌లో నెలవారి మరమ్మతులలో భాగంగా శనివారం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున వినియోగదారులు, పరిశ్రమల దారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా ఏడీఈ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు..

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, తాజా మాజీ సర్పంచ్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇటీవల వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెంజ ల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనే యులుతో పాటు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. రెంజల్ తాజా మాజీ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్‌తో పాటు మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, ఉపాధ్యాయులు హనుమన్లు, గంగాధర్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉషోదయ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణం లోని ఉషోదయ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషోదయ జూనియర్ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల 27వ వార్షికోత్సవ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శీలా నువ్వే.. శిల్పివి నువ్వే.. శిల్పం నువ్వే అంటూ విద్యార్థులను వారి భవిష్యత్తును వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలో మీ చేతులలోనే ఉందంటూ ఆయన హితబోధ చేశారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా జీవితం ఉన్నత స్థాయిలో వెలిగేలా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం ఉషోదయ విద్యాసంస్థల డైరెక్టర్ దుష్యంత్ మాట్లాడుతూ.. విద్యార్థు లు క్రమశిక్షణ కలిగి ఉండాలని దాంతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. కళాశాల డైరెక్టర్ సునీత మాట్లాడుతూ విద్యార్థులలో సమన్వయం లోపిస్తే జరిగే పరిణామాలు ఎంత దారుణంగా ఉంటాయో ఆమె వివరించారు. కళాశాల స్థాయిలోనే విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు జానపద పాటలపై చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు నరేందర్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పది విద్యార్థులకు వీడ్కోలు సభ


విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థుల చేత శుక్రవారం ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వీడ్కోలు సమావేశం సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఉదయం వేళలో సరదాగా కొన్ని గేమ్స్ ఆడించారు. అనంతరం పదవ తరగతి 2023-24 బ్యాచ్ గ్రూప్ ఫోటోను దిగారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమావేశంలో త్వరలో పాఠశాల విద్యను పూర్తి చేసుకొని వెళ్లబోతున్న విద్యార్థులు మాట్లాడుతూ తమకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యాబుద్ధులు చెప్పిన పాఠశాల టీచర్స్‌ను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతికి బోధించిన ఉపాధ్యాయులు పదవ తరగతిలో అత్యధిక జి.పి.ఏ సాధించడానికి సలహాలను సూచించారు. అనంతరం పాఠశాల హెచ్.ఎం నాంపల్లి మల్లేశం మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యధిక జి.పి.ఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు పరీక్షలు అంటే భయపడద్దని భయం వీడితేనే జయం కలుగుతుందన్నారు. అందుకని ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మ విశ్వాసంతో ఉండాలని సూచించారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్మాస్టర్స్ క్యాదారి రాజేందర్, సామల పట్టాభి, టీచర్స్ సాహిన్ బేగం, సబియా సిద్ధికి సంగీత, బుజ్జయ్య, షాహిన్, ఫాతిమా, బుతూల్ ఫాతిమా, నవీద్ నస్రీన్, రమేష్, బాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తండాల అభ్యున్నతే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు

నవతెలంగాణ-పిట్లం

తండాల అభ్యున్నతే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బండాపల్లి, బండాపల్లి తండా, కోమటి చెరువు తాండ, బొగ్గులకుంట తాండ, మద్దెల్‌చెరువు, బొల్లక్‌పల్లిలో విజయోత్సవ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి తండాలలో సిసిరోడ్లు, విద్యుత్తు, కనీస మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఎండాకాలం దృష్ట్యా తాండాలలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టి తాగునీరు అందిస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామని తెలిపారు. కాగా సభ ముందుగా తండాలలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దీంతో ఎమ్మెల్యే తండాలలోని సేవాలాల్ మహారాజ్, మహంకాళి మాత గుడులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాండవాసులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌రెడ్డి, జంబిగే హన్మాండ్లు, మురళీధర్‌గౌడ్, కృష్ణారెడ్డి, చందర్ రాథోడ్, కాటేపల్లి మొగులగౌడ్, తాండవాసులు కాంగ్రెస్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వ్యవసాయ రంగాన్ని కాపాడండి.. మోడీని తొలగించండి

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

వ్యవసాయ రంగాన్ని కాపాడండి.. మోడీని తొలగించండని సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను కొత్త బస్టాండ్ ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఢిల్లీలో రైతులు తమ న్యాయమైన సమస్యలపైన ఆందోళన చేస్తుంటే వారిపై మోడీ సర్కార్ జరిపిన కాల్పుల్లో యువరైతు శుభకరన్ సింగ్ అమరత్వం పొందారన్నారు.

మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేకంగా, కార్పొరేట్ వ్యాపార వర్గాలకు ఊడిగం చేసే విధానాలను చేపట్టడం మూలంగా లక్షలాది మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆ పరంపరంగా ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. ఎన్నికల వాగ్దానాల్లో రైతుకు రెండింతలు ఆదాయం తెచ్చిపెడతానన్న మోడీ హామీ నీళ్ల మూట అయిందని ఎద్దేవా చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరిపి ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.పరమేష్, అఖిలభారత వ్యవసాయ కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు అంబన్న, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కిషోర్, లక్ష్మీనారాయణ, గోపాల్, సత్యం, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు సరి చంద్, జిల్లా కోశాధికారి శ్రీకాంత్, వెంకన్న పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఐ నాయకులు

డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని జడ్పిటిసి తీగల తిర్మాల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రం నుండి కామారెడ్డికి వెళ్లే ముత్యంపేట గ్రామం వద్ద డబుల్ రోడ్డు పనులను శుక్రవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ మండల కేంద్రం నుండి ముత్యంపేట గ్రామం నుండి కామారెడ్డి జిల్లా కేంద్రానికి ప్రయాణికులు వెళ్లడానికి డబులు రోడ్డు నిర్మాణం మంజూరు అయి రోడ్డు పనులు కొనసాగుతున్న దశలో పనులను పరిశీలించామని తెలిపారు. పనులు వేగవంతంగా చేపట్టాలని, నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు పనులు తొందరగా పూర్తి చేయాలని, నాణ్యత నియమాలు పాటించే విధంగా చూడాలని ఆర్అండ్‌బి డిఈ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దోమకొండ నుండి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి, భిక్కనూర్ వరకు మూడు కోట్ల రూపాయలు మంజూరు అయిందని ఆర్అండ్‌బీ డిఈ శ్రీనివాస్ జడ్పీటిసికి తెలిపారు. ఆ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తారని, ముత్యంపేట మీదుగా డబుల్ రోడ్డు పనులు పూర్తయితే దోమకొండ, బీబీపేట, దుబ్బాక, మండలాల నుంచి ప్రయాణం సాగించే వారికి రోడ్డు మార్గం సులువుగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్ వెళ్లడానికి మాచారెడ్డి, గంభీరావుపేట, సిరిసిల్ల మండలాల ప్రజలకు ఈ రోడ్డు మార్గం ద్వారా వెళ్తే దూరభారం తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, కదిరే గోపాల్‌రెడ్డి, నాగారపు రాములు, ముత్తగారి ముత్యంగౌడ్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

జీపీని సందర్శించిన ఎంపిడీవో



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మండల పరిషత్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని జీపీ కార్యదర్శి హరీష్‌కు ఆదేశించారు. జీపీలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిశీలించాలని, వందశాతం పన్నులు వసూళ్లు చేయాలన్నారు. గ్రామాలలో పరిశుభ్రతతో పాటు ఎండకాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా సమస్య ఉన్న చోట గుర్తించి బాగు చేయాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ కపిల్ పటేల్ ఎంపీడీవోను కలిసి మొదటిసారిగా ప్రత్యేక అధికారి హోదాలో వచ్చినందుకు కార్యదర్శి హరీష్‌తో కలిసి శాలువాతో ఎంపిడివో శ్రీనివాస్‌ను సన్మానించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని అచ్చంపేట్ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి 6వ, 7వ, 10వ తరగతి ప్రవేశాలకు పరిమిత ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు ఈ నెల 22 ఉండగా.. మార్చి 2 తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిజాంసాగర్ మండల విద్యార్థులకు ఆమె సూచించారు.

పబ్లిక్ స్కూల్లో రెండు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి బేగంపేట్‌లోని 1వ తరగతిలో ఇంగ్లీష్ మీడియంలో (2) సీట్లు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ (2) సీట్లను భర్తీ చేయుటకు అర్హులైన షెడ్యూల్డు కులముల (ఎస్సీ) బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుచున్నట్టు ఆయన ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తు ఫారములను షెడ్యూల్డు కులాల అభివృద్ధి కార్యాలయంలో పొందవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తు చేయు బాల, బాలికలు 01-06-2017 నుంచి 31-05-2018 మధ్య జన్మించి ఉండలని, దరఖాస్తు చేయు బాల, బాలికలు తల్లిదండ్రుల, సంరక్షణ ఆదాయం కామారెడ్డి అర్బన్ ఏరియాలో రూ.2,00,000లు, రూరల్ ఏరియాలో రూ.1,50,000లు మించి ఉండవద్దని సూచించారు. దరఖాస్తులను 12-03-2024 సాయంత్రం 5గంటల వరకు సమర్పించాలని పేర్కొన్నారు. 15-03-2024న జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయబడునని తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఇటీవలే తహసీల్దార్‌గా భాద్యతలు చేపట్టిన హిమబిందును జుక్కల్ కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హిమబిందు మాట్లాడుతూ.. మారుమూల మండలంలోని పేద ప్రజలకు సేవలిందించి వారి మన్ననలు పొందుతానని ఆమె అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్బర్‌వార్ సాయిలు, ఆర్ఐ రామ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలికి జనతా ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ గ్రామ సింగిల్ విండో ఆధ్వర్యంలో మంజూరైన జనతా ఇన్సూరెన్స్ లక్ష రూపాయల చెక్కును బాధితురాలైన గొల్ల కిష్టవ్వకు సంఘ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ సాయిరెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య సింగిల్ విండో సంఘం సభ్యుడై గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన భార్య గొల్ల కిష్టవ్వ నామినిగా ఉన్నందున ఆమెకు జనతా ఇన్సూరెన్స్ పథకం కింద మంజూరైన ఒక లక్ష రూపాయల చెక్కును అందించారు. ప్రతి ఒక్క సంఘ సభ్యులు జనతా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వడగామ సాయిలు, డైరెక్టర్లు, సీఈవో అశోక్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందేలా అవగాహన కల్పించాలి



● డిపిఎం నూకల శ్రీనివాస్

నవతెలంగాణ-భీంగల్

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా అవగాహన కల్పించాలని డిపిఎం నూకల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో వివోఏలకు డిపిఎం ఆధ్వర్యంలో శిక్షణ అందజేశారు ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 80 యూనిట్లను గుర్తించి వారికి జీవనోపాధికి ఐకెపి ద్వారా బ్యాంకులలో రుణాలను ఇప్పించాలన్నారు. తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ శిక్షణలో నిజామాబాద్ జిల్లా ఏపీఎం సరోజిని, సీసీలు పురస్తు నరేష్, భాస్కర్, సాయిలు, సుమలత, వీవోఏలు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానం అన్నారు. బిడ్డకు ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతోపాటు అనుబంధ పోషకాహారం అందించాలని వివరించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 13న పేకాట ఆడుతుండగా పట్టుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఐదుగురికీ రెండు రోజులపాటు జైలు శిక్ష విధించినట్లు నాల్గవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంజీవ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాంగ్ర వాగు పక్క న డబ్బులు పెట్టి పేకాట ఆడుతుండగ ఐదు గురు వ్యక్తులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని నిజామాబాద్ నిజామాబాద్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రెండు రోజులపాటు జైలుశిక్ష విధించారని తెలిపారు.

నేడు దులగుట్ట జాతర

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ దులగుట్ట వద్ద గల 'శ్రీ శివశ్రీనివాస కళ్యాణ మహోత్సవం' ఆలయ జాతర మహోత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనివారం శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని అన్నారు. శ్రీవారి కల్యాణ మహోత్సవంతోపాటు మల్లన్న జాతర మహోత్సవం సైతం కొనసాగుతుందని అన్నారు. జాతర ఉత్సవాల్లో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం, సెక్రటరీ గడ్డం పెద్ద గంగారెడ్డి, కోశాధికారి నరేష్ యాదవ్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, యువజన సంఘం నాయకులు రమేష్, ఉమేష్, రాంరాజ్, నార్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మొన్న శాసనసభ లో బిసి సమగ్ర కుల గణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో మండల యువజన విభాగం ఆధ్వర్యంలో మండల బీసీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి చిత్రపటాలకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం పది సంవత్సరాలు టిఆర్ఎస్ పార్టీ, బిజెపి పార్టీ బీసీలను చిన్నచూపు చూశాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల కులగణనకోసం తీర్మానం ఏకగ్రీవంగా చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పారీ వినోద్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్, నాయి బ్రాహ్మణ అధ్యక్షులు రమేష్, మైనార్టీ మండల అధ్యక్షుడు సైకిల్ టెక్స్ అక్బర్, జిల్లా యువజన విభాగం సెక్రెటరీ ముంబాయి రాజేందర్, లక్ష్మాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు నరేష్, జీవన్, మండల రజక సంఘం అధ్యక్షులు సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎంపీడీవోకు సన్మానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నూతనంగా వచ్చిన తహసీల్దార్, ఎంపీడీవోను మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తాసిల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీష్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిఎల్‌టియు యూనియన్ ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎల్‌టియు) నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల కన్వీనర్‌గా మేకల రాజేందర్, కో-కన్వీనర్ ఎల్లారెడ్డిలను ఎన్నికచేసినట్లు బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగిన నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సదస్సులో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్‌టియు ఉమ్మడి జిల్లాల సమన్వయ కమిటిని ఎన్నిక చేశారు. ఈ సమావేశంలో బీల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు మాట్లాడుతూ.. మున్సిపల్, గ్రామ పంచాయతీలలో శానిటేషన్ రంగంలో పని చేసున్న బహుజన శ్రామిక వర్గానికి కనీస వేతనం రూ.50వేల ఇచ్చినా తక్కువే అన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా నూతన సమన్వయ కమిటిని ఎన్నిక చేశారు. కన్వీనర్‌గా మేకల రాజేందర్ నిజామాబాద్, కో-కన్వీనర్‌లుగా ఎల్లారెడ్డి కె.కృష్ణ, పి.రాజేశ్వర్, మరో తొమ్మిదిమంది సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రారంభమైన మల్లన్న జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో మల్లన్న జాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారికి గంగా స్నానం నిర్వహించారు, అనంతరం పల్లకిని ఊరేగించారు, మహాలక్ష్మి మందిరం నుండి సిడి రథాన్ని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో మల్లన్న దేవాలయానికి తరలించారు. శనివారం స్వామి వారి కళ్యాణం, రథోత్సవం, బోనాలు, నైవేద్యం, జాతర నిర్వహించనున్నారు. ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని పొందుర్తి గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాస్‌కు చెందిన గేదె శుక్రవారం ఉదయం విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గేదె దేమే నర్సింలుకు చెందిన వ్యవసాయ భూమిలో మేతమేయడానికి వెళ్లగా నర్సింలు తన పొలం సంరక్షణకు గాను విద్యుత్ తీగలను అమర్చగా ఆ తీగలకు తగిలి గేదె మృత్యువాతపడింది.

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

● జిల్లా విద్య శాఖ అధికారి దుర్గప్రసాద్

నవతెలంగాణ-ఆర్మూర్

పదవ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం డివిజన్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మోడల్ పాఠశాల, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవాం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు విధిగా నిర్వహించాలని బడి బయట పిల్లలను గుర్తించి వారికి 'పని ప్రాంత పాఠశాలలు' ఏర్పాటు చేయాలని సి గ్రేడ్ విద్యార్థులను ఏ గ్రేడు వచ్చేటట్లు కృషి చేయాలని అన్నారు.

మార్చి 1 నుండి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులకు లైబ్రెరీ పీరియడ్ లో కథల పుస్తకాలు చదివించాలని సూచించారు కార్యక్రమంలో ఆర్ వి ఎం సెక్టోరియల్ అధికారులు జిసిడిఓ, వనిత శ్రీనివాస్, శ్రీధర్, మండల విద్యాధికారి రాజా గంగారాం, శ్రీనివాస్ రెడ్డి మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్

నర్సరీ, శ్మశాన వాటిక పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్, రాజరాజేశ్వరి నగర్ గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఇటీవల కమ్మర్ పల్లి ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారిగా ఉప్లూర్, రాజరాజేశ్వరి నగర్ గ్రామపంచాయతీలను సందర్శించారు. ఎండలు ముదిరినందున మొక్కలకు ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా నీటిని అందించాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. నర్సరీలో ఎన్ని మొక్కలను సిద్ధం చేస్తున్నారు.. ఏ ఏ రకాల మొక్కలను పెంచుతున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల నుండి మొక్కలను కాపాడేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. నర్సరీల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలను పరిసరాలల్లో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, శ్రీకాంత్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అశ్వపతి, తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

● కొడుకుకు తలకొరివి పెట్టినతల్లి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కొన్నిరోజుల క్రితం గల్ఫ్‌లో గుండెపోటుతో ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన విజయ్ మృతి చెందాడు. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. కొడుకుకు తల్లి కొరివి పెట్టింది. విజయ్‌కు తల్లి, అక్క, చెల్లి ఉన్నారు. గతంలో చెల్లి పెండ్లి సమయంలో కొంత మేరకు అప్పు చేసి వివాహం జరిపించారు. ఆ అప్పు తీర్చడానికి గల్ఫ్ కు వెళ్లాడు. నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారికి ఆర్థిక సహాయం చేసి కుటుంబాన్ని రోడ్డున పడకుండా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. అప్పు తీర్చడానికి తల్లికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. విజయ్ గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండేవాడని రోధిస్తూ తెలిపారు. ప్రజా ప్రతినిధులు బాధ్యత కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఖిల్లా డిచ్‌పల్లిలో ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో శ్రీ సీతారామ చంద్రస్వామి తిరుకళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పదవుల కోసం అవిశ్వాసాలు పెట్టడం సిగ్గు చేటు



నవతెలంగాణ-సిరికొండ

పదవుల కోసం పనిగా పెట్టుకుని అవిశ్వాసాలు పెట్టడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని సొసైటీలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైన విషయం విదితమే. వీరితో పాటు ఏడుగురు డైరెక్టర్లు అనామత్ ఖాతా కింద 3-5 లక్షలు బాకీ ఉన్నారని, ఎన్నికలు అయ్యి పదవులు పొందాక వారు డబ్బులు చెల్లించారని అన్నారు. నియమాలకు విరుద్ధంగా నూతన కమిటీ ఎన్నుకున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని డీసీఏఒ పావయ్యకు బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గతేడాది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆర్థిక లావాదేవీలపై ఈ విషయాన్ని పాలకవర్గం నుండి డీసీఓకి వినతి పత్రం ఇచ్చిన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ ఆనంద్ బాబు, ఎంపీపీ సంగీత రాజేందర్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, బీఆర్ఎస్, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న ఎంపీ



నవతెలంగాణ-ఆర్మూర్

కొమరం భీమ్ క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర సన్నాక సమావేశం అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని బిజెపి క్యాంప్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందని ఇక్కడ ఏ పార్టీ వారు అయితే గెలుస్తారో.. వచ్చేసారి ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ప్రజలు ముందస్తు ఆలోచనతో ఉంటారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో అతి తక్కువ ఓటర్లు ఉన్న అత్యధిక మెజారిటీ ఇచ్చారని తెలిపారు. ఈసారి కూడా అంతకన్నా ఎక్కువ మెజారిటీతో ప్రధానిగా మోడీని గెలిపిస్తారని అన్నారు. పోయినసారి పార్లమెంట్ ఎలక్షన్‌లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్నానని తెలిపారు. ఈసారి కచ్చితంగా భారీ మెజారిటీతో రైతులే గెలిపిస్తారని, ప్రతిపక్ష పార్టీలన్నీ కేవలం వారి ఉనికిని కాపాడుకోవడం కోసమే విమర్శలు చేస్తున్నాయి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్, పార్లమెంట్ ప్రభారి వెంకటరమణి, నందకుమార్ సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

● పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బాసర ట్రిబుల్ ఐటీలో పియుసి మొదటి సంవత్సరం చదువుతున్న తెనుగు శిరీష ఆత్మహత్యపై సిబిఐ విచారణ జరిపించాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు.శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ యూనివర్సిటీలో లేని ఆత్మహత్యలు ఒక్క ట్రిబుల్ ఐటీ లోనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ప్రతి విద్యా సంవత్సరం పదుల సంఖ్యలో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి ఆత్మహత్యను వ్యక్తిగత కారణాలను జోడించి చూపిస్తున్నారని అన్నారు. విద్యార్థులతో మాట్లాడనివ్వకుండా క్యాంపస్‌లో విద్యార్థి సంఘాలను అనుమతించడం లేదని, విద్యార్థుల ఆత్మహత్యల కారణాలు తెలుసుకోవడానికి గత సంవత్సరం స్వయాన రేవంత్ రెడ్డి గోడదూకి లోపలికి పోయారని తెలిపారు. వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూ యూనివర్సిటీ నాయకులు ప్రిన్స్, జయంతి, రవీందర్, అక్షయ్,బిందు, ప్రవీణ, అనూష,నవ్య,రేణుక, భారత్,జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ, ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూని వర్సిటీ మరియు అనుబంధ కళాశాలల పీ.జీ. మొదటి సెమిస్టర్ (ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సి, ఎంబీఏ, ఎంసీఏ) ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్‌ల (ఏపీఈ, ఐపిసిహెచ్, ఐఎంబీఏ) 7వ సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షలు రెండవ రోజు ప్రశాంతంగా జరిగినట్లు యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ పరీక్షలకు ఉదయం 1911 మంది విద్యార్థులకుగాను 1810 మంది విద్యార్థులు హాజరయ్యారు. 101 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. ఈ పీజీ పరీక్షలు, తెలంగాణ వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, తెలంగాణ వర్సిటీ బిక్నూర్ సౌత్ క్యాంపస్, గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్, గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ డిగ్రీ ఆర్మూరు సెంటర్లలో పరీక్షలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

జైలును సందర్శించిన ఉన్నతాధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్ర కారాగారంను జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్ర, జైళ్ల శాఖ ఐజి ఎన్. మురళి బాబు, వరంగల్ రేంజ్ డిఐజి, ఎం. సంపత్ శుక్రవారం సందర్శించారు. వారందరు మహిళా బ్లాకు నందు సందర్శించి మహిళా ముద్దాయిల విజ్ఞప్తులు విన్నారు. మహిళా సిబ్బంది రిక్వెస్ట్‌లను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిల బ్లాకును సందర్శించి వారి విజ్ఞప్తులు విన్నారు. జైలు అంతటా తిరిగి ప్రతి బ్లాకును సందర్శించారు. ఆసుపత్రి బ్లాక్‌ను పరిశీలించి అక్కడి వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రింటింగ్ ప్రెస్ యూనిట్ సందర్శించి అందులో ఖైదీలతో తయారు చేసిన ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు స్టీల్ ఫ్యాక్టరీ పరిశీలించి అక్కడి ఉత్పత్తులు పరిశీలించారు. నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డుప్రమాదంలో యాచకుడు మృతి



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా సిగ్నల్స్ వద్ద టిప్పరు కిందపడి యాచకుడు గురువారం మృతిచెందాడు. సిసి ఫుటేజ్ పరిశీలించగా మృతికి ప్రభుత్వ ఉద్యోగి కారణం కావడంతో వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళన చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ ప్రాంతంలో నివాసం ఉండే శివరాం (32) యాచకుడు మామిడిపల్లి చౌరస్తా సిగ్నల్స్ వద్ద కారు అద్దాలను తుడుస్తూ యాచకుడిగా జీవనం కొనసాగిస్తున్నాడు. డివిజన్లోని మెండోరా డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ విధు లు నిర్వహించుకొని పట్టణానికి తిరిగి వస్తున్న క్రమంలో చౌరస్తా వద్ద సిగ్నల్స్ పడడంతో కారు ఆపాడు. అంతలోనే ట్రాఫిక్ గ్రీన్ సిగ్నల్స్ పడడంతో కారును ముందుకు పోనిచ్చాడు. యాచకుడు వెంటపడి డబ్బులు అడుగుతుండడంతో నెట్టివేయడంతో ఎగిరి పక్కకు పడ్డాడు. అదే సమయంలో టిప్పర్ వచ్చి ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. యాచకుని మృతికి కారణమైన ప్రభుత్వ ఉద్యోగి పట్ల తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. వ్యక్తి మృతితో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ శుక్రవారం తెలిపారు.

ఇంగ్లీష్ లర్నింగ్ తరగతుల పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

కాకతీయ స్యాండ్ బాక్స్ దేశపాండే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజీవ్ రెడ్డి, ఐడిహెచ్.మధు శుక్రవారం ఆలూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. మూడు సంవత్సరాలుగా ఇంగ్లీష్ లర్నింగ్ తరగతులు నిర్వహిస్తున్న సెంటర్ పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించిన రాజీవ్ రెడ్డిని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేష్ శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, మాజీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శౌరి రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు రాంప్రభూ, వృత్తి విద్య అధ్యాపకులు మహమ్మద్ అశ్ఫాక్ అహ్మద్, ట్రైనర్ సువర్ణ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రివార్డు యాడ్స్‌లను నమ్మి మోసపోవద్దు : ఎస్ఐ

నవతెలంగాణ-ముప్కాల్

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రివార్డు యాడ్స్ లను నమ్మి ప్రజలు మోసపోవద్దని ముప్కాల్ ఎస్ఐ భాస్కరాచారి శుక్రవారం రోజు ఒక ప్రకటనలో తెలియజేశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వాట్సాప్ గ్రూప్ 'లోగో' తో మీ మొబైల్లో వాట్సాప్‌కు మెసేజ్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ యజమానులు మెసేజ్ వచ్చిన వెంటనే అట్టి గ్రూప్ నుంచి రిమూవ్ కావాలని, అలాగే అట్టి గ్రూప్‌ను సైతం పూర్తిగా డిలీట్ చేయాలని సూచించారు.

జెన్ ప్యాక్ట్ కంపెనీకి ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జెన్ ప్యాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల కోసం ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జెన్ ప్యాక్ట్‌లో ప్రాసెస్ అసోసియేట్‌గా ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యోగ మేళా ఈ నెల 25న దుబ్బ గుర్బాబాది రోడ్ లోని అక్షర్ ధామ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వారు ఉద్యోగ మేళాలో పాల్గొనడానికి అర్హులని ఎమ్మెల్యే ధన్‌పాల్ వివరించారు. ఇంటర్వ్యూ లో ఉద్యోగం సాధించిన వారికి సంవత్సరానికి 2.3 నుంచి 2.4 లక్షల వరకు జీతం చెల్లిస్తారన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారు హైదరాబాదులోని హఫీజ్ పేట్ లో పనిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అర్హులైన నిరుద్యోగులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నర్సరీని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామ నర్సరీని శుక్రవారం మండల అభివృద్ధి అధికారి సాయిరాం పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి హరీష్ రావు, సెక్రటరీ సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ముజీగే మల్లన్న జాతర



నవతెలంగాణ ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యానం గుట్ట వద్ద గల ముజీకే మల్లన్న జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు విడిసి సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ జాతరకు పట్టణంతో పాటు పెర్కిట్, గోవింద్ పెట్, బ్రాహ్మణపల్లి, తొర్లికొండ, అర్గుల్, జక్రాన్‌పల్లి నుండి సైతం ప్రజలు హాజరవుతారు..

50సంవత్సరాల నుండి...

ఈ ముజీగే మల్లన్న జాతర(షిడి) రథానికి 6, 8,, ఫీట్ల ఎత్తుతో ఉండే బంతిపూల తొట్లీలను ఇక్కడి విశ్వబ్రాహ్మణ మహిళలు తయారు చేస్తారు. డప్పు వాయిద్యాలతో ఈ తొట్లలను ఊరేగింపుగా తీసుకొని రథానికి కట్టి ఊరేగింపుగా తీసుకెళ్తారు. నేడు జరిగే జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని స్థానిక కౌన్సిలర్లు మేడిదాల రవి గౌడ్ ,కవిత కాశిరాం, ఆకుల రాము తదితరులు కోరారు.

జెడ్పి సీఈఓను కలిసిన జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్



నవతెలంగాణ-రామారెడ్డి

జిల్లా పరిషత్ సీఈఓ చందర్ నాయక్‌ను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పద్మశాలీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మనోహర్ తెలిపారు. సుమారు 150 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 50 మందికి ఆపరేషన్ నిమిత్తం నిజామాబాద్ తరలిస్తున్నట్లు తెలిపారు. మోతిబిందు గల 50 మందికి నిజామాబాద్‌లోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నిమ్మ రాజన్న, సత్యనారాయణ, భోగానంద్, రాజ్‌పాల్, శ్రీనివాస్, సంజు, మోహన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.